సాక్షి అనకాపల్లి

శనివారం । 19 । అక్టోబర్ । 2024

ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా విజయసాయిరెడ్డి

ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా బొత్స సత్యనారాయణ




సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా వి.విజయసాయిరెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అదేవిధంగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు.



ఆలోచనలు.. ఆవిష్కరణలు

కొక్కిరాపల్లి గురుకులంలో రెండు జిల్లాల సైన్స్ ఫెయిర్ జరిగింది. విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. 8లో

న్యూస్‌రీల్

స్వగ్రామం చేరిన ఆర్మీ జవాన్ భౌతికకాయం



విశాఖలో నాయుడు బాబు భౌతికకాయానికి నివాళి

కశింకోట: పరవాడపాలెం గ్రామానికి చెందిన ఆర్మీ క్లరికల్ జవాన్ పరవాడ నాయుడుబాబు (34) గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహం శుక్రవారం రాత్రి ఇక్కడకు చేరింది. ఆయన జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం లేహ్‌లో రెండేళ్ల పనిచేశారు. బదిలీ కావడంతో ఢిల్లీ రావడానికి విమానం ఎక్కగా గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో మృతి చెందినట్లు సమాచారం. ఆర్మీ, నేవీ అధికారులు, పోలీసులు మృతదేహాన్ని విమానంలో విశాఖ విమానాశ్రయానికి తీసుకువచ్చి అక్కడి నుంచి పరవాడపాలెంలో ఉన్న సొంత ఇంటికి చేర్చారు. శనివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నట్లు స్థానికులు తెలిపారు. నాయుడుబాబుకు ఏడాది క్రితం శాంతితో వివాహం అయింది.

ఆర్డీవోతో మైనింగ్ అధికారుల భేటీ

నర్సీపట్నం: గబ్బాడ డిపోలోని ఇసుక నిల్వలపై ఆర్డీవో వి.వి.రమణతో మైనింగ్ అధికారులు చర్చించారు. నాలుగు నెలలుగా డిపోలోని ఇసుక పంపిణీ కాలేదు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు, నర్సీపట్నం ఏడీ శివాజీ, సహాయ జియాలజిస్ట్ వెంకటరమణ గబ్బాడ డిపోను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆర్డీవోతో సమావేశమయ్యారు. ఇసుక సరఫరాపై చర్చించినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు.

28 నుంచి బాలల ప్రతిభాపాటవ పోటీలు



పీఆర్‌టీయూ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: విద్యార్థుల్లో దాగివున్న కళలను వెలికితీసేందుకు పీఆర్‌టీయూ నిర్వహిస్తున్న బాలల ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న పోటీల బ్రోచర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ మాట్లాడుతూ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బాలల ప్రతిభాపాటవ పోటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీలు నర్సీపట్నం గవర్నమెంట్ హైస్కూల్‌లో జరుగుతాయని పేర్కొన్నారు. కల్చరల్ కమిటీ చైర్మన్ బాబీ, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వరహాలనాయుడు, జి.వి.రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎమ్మెస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

తుమ్మపాల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం కూండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం జరిగాయి. అండర్ -17 విభాగంలో బాల బాలికలకు పోటీలు నిర్వహించి, జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఒక్కో విభాగంలో 12 మంది ప్రధాన క్రీడాకారులతో పాటు ఇద్దరు అదనపు క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు త్వరలో జరగనున్న ఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు తెలిపారు.

తండ్రి రుణం తీర్చుకున్న తనయ



అప్పన్నపాలెంలో తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్న కుమార్తె చిలుకు

రాంబిల్లి (యలమంచిలి) : అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి ఓ కూతురు తలకొరివి పెట్టి కన్నరుణం తీర్చుకుంది. పలువుర్ని కంటతడి పెట్టించిన ఈ ఘటన శుక్రవారం రాంబిల్లి మండలం అప్పన్నపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొగబకూర్తి రాము వ్యవసాయ కూలి. వృద్ధాప్యం కారణంగా ఉంటివద్దే ఉంటున్నాడు. అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయనకు చిలుకు,చిన్నమ్మలు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మగపిల్లలు లేకపోవడంతో కన్నతండ్రికి పెద్ద కుమార్తె చిలుకు తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది.

రైతుల నోట్లో మట్టి

- నిర్వాసితులను బెదిరించేందుకు పీలా గోవిందు రీసర్వే డ్రామా
- 'కోడూరు' పరిహారం కొట్టేసేందుకు తాజా ఎత్తుగడ
- పదిమంది బినామీలతో నిధులు కాజేసేందుకు గతంలోనే యత్నం
- 2017లో అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి అమర్‌నాథ్ కృషితో రూ.8 కోట్లు విడుదల
- కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఆ నిధులపై కన్నేసిన పీలా
- రీసర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులను అడ్డుకున్న రైతులు

చేతిలో అధికారం ఉంటే చాలు వాస్తవాలను వక్రీకరించవచ్చన్నది టీడీపీ పాలసీ. తిమ్మిని బమ్మి చేసి అధికారులను మాయ చేసి రైతులకు అన్యాయం చేయడానికి ఎంతకైనా తెగిస్తారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అదే విధానంతో ముందుకెళుతున్నారు. ఏడేళ్ల క్రితం సమాధి అయిన కోడూరు భూముల పరిహారం ఆశలను మళ్లీ పైకి తీశారు. నిర్వాసితుల్లో పదిమంది బినామీలను చేర్చాలని, లేకుంటే అసలు పరిహారమే అందకుండా చేస్తానని రైతులను బెదిరిస్తున్నారు. ఇందుకోసం వారిపై రీసర్వే అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. శుక్రవారం కోడూరు వెళ్లిన రెవెన్యూ అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమ పొట్టకొట్టవద్దని వేడుకున్నారు.

సాక్షి, అనకాపల్లి:

సరిగ్గా ఏడేళ్ల కిందట 2016-17లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేర్‌హౌస్ గోడౌన్ కోసం కోడూరులోని సర్వే నంబర్: 20 పరిధిలోని 39.38 ఎకరాలను సేకరించారు. నాటి టీడీపీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నష్టపరిహారంలో సగం మొత్తం తనకు ఇస్తేనే ల్యాండ్ అక్విజేషన్ చేయిస్తానని రైతులతో బేరసారాలు చేసినట్లు అప్పట్లో ఆరోపణలున్నాయి. వాస్తవానికి నిర్వాసిత రైతులు 37 మంది కాగా తన బినామీలను యాడ్ చేసి 47మందితో జాబితా తయారు చేసినట్లు ఆరోపణలుండడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రస్తుత ఎంపీపీ గొర్లి సూరిబాబు గ్రామ సభల్లో బహిరంగంగా వ్యతిరేకించి.. ఆ లోపాలను బయటపెట్టారు. అప్పటి జాయింట్ కలెక్టర్ సృజనకు ఫిర్యాదు అందడంతో దీనిపై విచారణ చేయించి.. ఇందులో అవకతవకలు ఉండడంతో పూర్తిగా పరిహారం రద్దు చేశారు. అప్పటి అనకాపల్లి ఎమ్మార్వోగా ఉన్న కృష్ణమూర్తిని జేసీ సృజన సస్పెండ్ కూడా చేయడం జరిగింది. పరిహారం పంపిణీ నిలిచిపోవడంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు పెండింగ్‌లో ఉండగానే.. రైతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి నష్టపరిహారం అందజేయాలని కోరారు. ఈ స్థలాన్ని ఎంఎస్‌ఎంఈ పార్కుకు కేటాయించి ఏపీఐఐసీ నుంచి రైతులకు నష్టపరిహారం అందించేలా అమర్‌నాథ్ కృషి చేశారు.



కోడూరులో సర్వే నెం.20లో గల భూమి



రీసర్వేను అడ్డుకుంటున్న రైతులు

అధికారుల సూచనతో ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులు హైకోర్టులో కేసును ఉపసంహరించుకున్నారు. ఎన్నికలు ముగిశాక రైతులకు నష్టపరిహారం కింద సుమారు రూ.8 కోట్లు జిల్లా ఉన్నతాధికారి అకౌంట్‌లో జమయ్యాయి. ఈ నిధులపై ఇప్పుడు పీలా గోవింద సత్యనారాయణ కన్ను పడింది. రైతులను ఎలాగైనా భయపెట్టి తన వారికి దొంగ పరిహారం అందేలా కుయుక్తులు మొదలు పెట్టారు.

రైతుల ప్రయోజనాలు 'గోవిందా'

పీలా గోవిందు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పెట్టిన ఫేక్ రైతుల జాబితాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలగించారు. 2017లో పీలా 47 మందితో తయారు చేసిన నిర్వాసితుల జాబితాను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 37కు కుదించి పరిహార జాబితాను సిద్ధం చేశారు. నిధులు కూడా విడుదలయ్యాయి. గతంలో ఏ పేర్లు అయితే తొలగించారో అవి మళ్లీ జత చేస్తేనే వ్యవహారం ముందుకు కదులుతుందని, లేకుంటే రీసర్వే పేరిట పరిహారం అడ్డుకుంటానని గోవింద సత్యనారాయణ రైతులను బెదిరించినట్లు సమాచారం. రీసర్వే చేసిన తరువాతే నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్ విజయ కృష్ణన్‌ను ఆయన కోరారు. దీంతో శుక్రవారం సర్వే చేసేందుకు రెవెన్యూ బృందం కోడూరులో సర్వే నెంబర్ 20లో గల 39.38 ఎకరాల స్థలం వద్దకు వచ్చింది. స్థానిక రైతులు వీరిని అడ్డుకున్నారు. ఎప్పుడో ఏడేళ్ల కిందట భూసేకరణ జరిగింది.. ఇప్పుడు హద్దులు, సరిహద్దులు రైతులెవ్వరికీ గుర్తుండే పరిస్థితి లేదంటూ వారు ఆందోళన చేశారు.

మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం



మీడియాతో మాట్లాడుతున్న రైతులు

కోడూరులో నిరసన తెలుపుతున్న రైతులు మీడియాతో మాట్లాడారు. నాటి వివరాలను వెల్లడించారు. వారి మాటల్లోనే..

39.38 ఎకరాల వివాదాస్పద స్థలం కోడూరులో సర్వే నెంబర్ 20లో ఉంది. 2016లో అప్పటి కలెక్టర్ యువరాజ్ మా రైతుల అర్జీలకు గాను స్పందించి మా స్థలాలను సందర్శించారు. అప్పటి ఆర్డీఓ, ఎమ్మార్వో, సర్వేయర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే జియోకాన్ సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించి, పలుమార్లు గ్రామసభలు కూడా నిర్వహించారు. ఎటువంటి అభ్యంతరాలు లేవు. 2017లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేస్తామని అధికారులు రైతుల బ్యాంకు అకౌంట్ నంబర్లు తీసుకున్నారు. కానీ నగదు జమ చేయలేదు. 2018లో రైతులంతా హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చింది. 2022లో రెవెన్యూ అధికారులు కలెక్టర్ బంగ్లా కట్టడానికి ప్రత్నించగా మేము అడ్డుకున్నాం. తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అప్పటి రెవెన్యూ అధికారులు కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకుంటే మూడు నెలల్లో నష్టపరిహారం ఇస్తామన్నారు. వారి మాట ప్రకారం కేసు ఉపసంహరించుకున్నాం. పరిహారం నిధులు అందజేయమని నాలుగు నెలలుగా కలెక్టర్ ఆఫీస్, ఆర్డీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పుడు రీసర్వే చేసి నష్టపరిహారం ఇస్తామంటున్నారు. ఇదే జరిగితే మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం.

- రైతులు గొర్లె అప్పలరాజు, లాలం నాయుడు, పైలా స్వామినాయుడు, వరహాలు, జెర్రిపోతుల రమణ, పైలా సరోజిని, లాలం అప్పలనాయుడు, పైలా మహాలక్ష్మి నాయుడు, గొర్లి దాలినాయుడు

నవరత్నాల శిలా ఫలకం తొలగింపునకు విఫలయత్నం

- టీడీపీ కార్యకర్తల ప్రోద్బలంతో పంచాయతీ సిబ్బంది అత్యుత్సాహం
- సర్వసిద్ధిలో అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం: సర్వసిద్ధి సచివాలయం నూతన భవనంపై గత ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగింపునకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ నాయకులు కొద్ది రోజులుగా భవనంపై మాజీ సీఎం వైఎస్ జగన్ బొమ్మతో ఉన్న నవరత్న పథకాల వివరాలతో కూడిన శిలా ఫలకాన్ని తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. రెండు రోజులు క్రితం వరకు పని చేసిన పంచాయతీ కార్యదర్శి చంద్రకళ తమకు అధికారికంగా ఆదేశాలు రాలేదని, వచ్చిన తరువాత తొలగిస్తామని చెప్పి తప్పించుకున్నారు. బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మిపై స్థానిక పచ్చ నాయకులు ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆమె శుక్రవారం శిలా ఫలకాన్ని తొలగించాలని పంచాయతీ స్వీపర్‌ను ఆదేశించింది. ఈ మేరకు ఆయన శిలా ఫలకం తొలగించేందుకు సిద్ధం కాగా.. వైఎస్సార్ సీపీ నాయకులు కాసెపు అప్పన్న, సాకా రామకృష్ణ, సర్పంచ్ కురందాసు గణేష్ అడ్డుకున్నారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలు అందివ్వడమే కాకుండా పంచాయతీలో పరిపాలన పారదర్శకంగా ఉండాలని లక్షల రూపాయలు కేటాయించి సచివాలయాలు నిర్మాణం చేపట్టారన్నారు. ఆ భవనాలపై అప్పటి అధికారులు అమలు చేసిన నవరత్నాలు పథకాలు తెలియజేస్తూ శిలా ఫలకం ఏర్పాటు చేశారని, తెలుగు తమ్ముళ్ల ఒత్తిడితో అధికారులు తొలగించడం మంచి పద్ధతి కాదని చెప్పారు.



సర్వసిద్ధి సచివాలయంపై నవరత్నాల శిలాఫలకం తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

భవనాలపై శిలా ఫలకాలు తొలగించాలని అధికారికంగా ఏమైన ఆదేశాలు ఉంటే చూపాలని ప్రశ్నించారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణను వివరణ కోరగా సచివాలయ భవనాలపై శిలా ఫలకాలు తొలగించాలని ఆదేశాలు ఏమి లేవన్నారు. ప్రభుత్వం మారిన తరువాత మాజీ సీఎంల చిత్ర పటాలు, పథకాలు బోర్డులు తొలగించామన్నారు. సర్వసిద్ధి గ్రామంలో భవనంపై శిలా ఫలకం తొలగిస్తున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు.

విద్యుత్ భారంపై ప్రజా ఉద్యమం



అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా



కోడూరులో సీపీఎం కార్యకర్తల రాస్తారోకో

అచ్యుతాపురం (మునగపాక)/కె.కోటపాడు: ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రజలపై ఎటువంటి భారాలు వేయబోమని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక 120 రోజులకే విద్యుత్ ట్రూ అప్, ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.8,114 కోట్ల భారం మోపడం తగదని సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేసి, కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామంలో రాస్తారాకో నిర్వహించారు. గతంలో బాదుడే బాదుడు అని గొంతు చించుకున్న టీడీపీ ఇప్పుడు మరింత భారం మోపేలా నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. మోడీ తెచ్చిన విద్యుత్ సంస్కరణలు 2020 చట్టానికి చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ మద్దతుగా నిలిచారా లేదా ప్రజలకు తెలియజేయాలన్నారు. 2021-22 సంవత్సరాల్లో వాడిన విద్యుత్‌కు ఇప్పుడు భారాలు మోపడమేమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు పేరుతో స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి ప్రజలపై భారాలు వేయడానికి పూనుకుందన్నారు. స్మార్ట్ మీటర్లకు తాము వ్యతిరేకమని, ఎక్కడైనా స్మార్ట్ మీటర్లు పెడితే బద్దలు కొట్టండడని గతంలో లోకేష్ పాదయాత్ర సందర్భంగా పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సీపీఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ రాము, సీనియర్ నాయకుడు కర్రి అప్పారావు, పార్టీ కె.కోటపాడు మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వనుము సూర్యనారాయణ పాల్గొన్నారు.

డోలీ మోతపై ఆర్డీవో ఆరా

- గిరిజన గ్రామం పీత్రుగెడ్డ సందర్శన
- ఆదివాసీల సమస్యలపై కలెక్టర్‌కు నివేదన

రోలుగుంట: బాలింతను డోలీపై ఇటీవల ఆరు కిలోమీటర్లు తరలించిన ఘటనపై నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ ఆరా తీశారు. అర్ల పంచాయతీ శివారు కొండ శిఖరాగ్ర గిరిజన గ్రామం పీత్రుగెడ్డ నుంచి ఆరు కిలోమీటర్ల మేర బాలింతను డోలీపై తరలించడంలో పడిన కష్టాలపై పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. ఈ మేరకు రోలుగుంట డిప్యూటీ తహసీల్దార్ శంకరరావుతో కలిసి ఆర్డీవో శుక్రవారం కాలినడకన కొండ శిఖరాగ్ర గ్రామమైన పీత్రుగెడ్డకు వెళ్లారు. అక్కడ ఆదివాసీలు పడుతున్న కష్టాలను స్వయంగా తెలుసుకున్నారు. రహదారి సౌకర్యం లేక రోగులు, గర్భిణులు, బాలింతలను తప్పనిసరి పరిస్థితుల్లో డోలీ మోతతో దిగువకు ఆరు కిలోమీటర్లు మేర తరలించేందుకు దశాబ్దాలుగా గిరిజనులు పడుతున్న కష్టాలను సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు ఆర్డీవోకు వివరించారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఈ గ్రామానికి చెందిన నెలలు నిండిన కిల్లో దేవి ఇంటి వద్దనే ప్రసవించిందని, బిడ్డకు ఆరోగ్యం బాగోకపోవడంతో గురువారం తెల్లవారుజామున తల్లీబిడ్డను కుటుంబ సభ్యులు డోలీలో బుచ్చింపేట ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు పడిన కష్టాలను ఆర్డీవోకు గ్రామస్తులు చెప్పుకున్నారు. అలాగే తమ ప్రాంతంలో రోడ్డు పనులు చేపట్టకుండానే రూ.26 లక్షలు ఖర్చు చేసినట్టు అధికారులు చూపిస్తున్నట్టు తెలిసిందని గిరిజనులు ఆరోపించారు. సమస్యలను జిల్లా కలెక్టర్‌కు నివేదించి, పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



గిరిజనుల సమస్యలను ఆర్డీవో వి.వి.రమణకు వివరిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు

ఆరు నెలల్లో 'మనబడి మన భవిష్యత్' పనులు పూర్తి

- స్టేట్ స్కూల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు
- దేవరాపల్లి మండలంలో పలు పాఠశాలల సందర్శన

దేవరాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మనబడి-మన భవిష్యత్ పథకంలో(మన బడి నాడు-నేడు) పెండింగ్ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్కూల్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టేట్ కోఆర్డినేటర్ కె.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఎ.కొత్తపల్లి, కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బేతపూడి కేజీబీవీ పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు ఎంత మేర పూర్తయ్యాయి, మిగిలి ఉన్న పనులకు ఎంత నిధులు అవసరం, పెండింగ్ బిల్లులు తదితర అంశాలను స్థానిక హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే చేపట్టిన పనులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులతో పాటు ఇంకా జరగాల్సిన పనులకు సుమారు రూ.1000 కోట్లు మేర నిధులు అవసరం ఉందని ఆయన తెలిపారు. కొత్తగా ఏర్పాటైన తల్లిదండ్రుల కమిటీ సభ్యులతో బ్యాంక్ ఖాతాలు తెరిచి, అందులో నిధులు జమ చేసి పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇంజినీర్ సంతోష్, ఎ.కొత్తపల్లి హెచ్ఎం వై.స్వర్ణలత, ఎమ్మార్సీ కార్యాలయ అకౌంటెంట్ ఎం.శ్రీను, సచివాలయ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.



బేతపూడి కేజీబీవీలో మనబడి మన భవిష్యత్ పనులను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ కె. నాగేశ్వరరావు

బేకరీలు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు



యలమంచిలిలో ఓ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీజ

- బేకరీలు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు

యలమంచిలి రూరల్: పట్టణంలో జిల్లా ఆహార భద్రత అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బేకరీలు, కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ఆహార, సరకుల శాంపిళ్లను సేకరించారు. ఇటీవల స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ చేసిన ఆకస్మిక తనిఖీల్లో పలు బేకరీలు, హోటళ్లలో అధ్వాన పరిస్థితులు బయటపడ్డాయి. దీంతో ఆహార భద్రత అధికారులను పిలిపించుకుని ప్రజారోగ్యంతో చెలగాట మాడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ అధికారి నక్కల శ్రీజ పట్టణంలో కాలం చెల్లిన మైదా పిండితో కేకులు తయారుచేస్తున్న ఓ బేకరీని, ఆ మైదా పిండి విక్రయించిన కిరాణా దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇదేం తీరని వారిని ప్రశ్నించి, తీరు మారకపోతే క్రిమినల్ కేసులు పెట్టి వ్యాపారాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. 4 శాంపిళ్లు సేకరించామని, వీటిని ప్రయోగశాలకు పంపించనున్నట్టు అధికారులు తెలిపారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు లేకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎలక్ట్రీషియన్ మృతి

- కిత్తంపేటలో విషాదఛాయలు



మృతి చెందిన ఎలక్ట్రీషియన్ దుర్గాప్రసాద్

చోడవరం: రావికమతం మండలం బెన్నవరం పంచాయతీ శివారు కిత్తంపేట గ్రామానికి చెందిన కొమనాపల్లి దుర్గాప్రసాద్ (28) విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం మృతి చెందాడు. అతడి కుటుంబం శోక సముద్రంలో మునిగింది. వివరాల్లోకి వెళితే.. ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ ఇదే గ్రామానికి చెందిన సీతిన రామారావు ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య రావడంతో ఆ పని కోసం వెళ్లాడు. ఇందులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు దొండపూడి వద్ద డీపీ స్విచ్ ఆఫ్ చేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. దాంతో కిందపడిపోవడంతో స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి దుర్గాప్రసాద్‌ను కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. భర్త మరణ వార్త విన్న లక్ష్మి హుటాహుటిన అక్కడకు చేరుకొని మృతదేహాన్ని చూసి సొమ్మసిల్లి పడిపోవడంతో అంతా ఆందోళన నెలకొంది. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో తల్లి కాసమ్మ, భార్య లక్ష్మి బోరున విలపించారు. తమకు దిక్కెవరంటూ గుండెలవిసేలా రోదించడంతో చూపరులను కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య లక్ష్మి, 3 సంవత్సరాలు, ఎనిమిది నెలలు వయస్సు కలిగిన ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి కాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.

అద్భుత ఆలోచనలు.. వినూత్న ఆవిష్కరణలు

చిట్టిబుర్రలు అద్భుతాలనే సృష్టించాయి. మన చుట్టూ ఉన్న సమస్యలే వారిని ఆలోచింపజేశాయి. వాటికి పరిష్కార మార్గాన్ని చూపించేలా ఆవిష్కరణల వైపు నడిపించాయి. సరికొత్త ప్రాజెక్టులు రూపకల్పన చేసి ఔరా అనిపించాయి. రెండు జిల్లాల సైన్స్ ఫెయిర్ వేదికగా వీరి నమూనాల ప్రదర్శనలు వీక్షకులను అబ్బురపరిచాయి.

- ఆకట్టుకున్న నమూనాలు
- కొక్కిరాపల్లి గురుకులంలో రెండు జిల్లాల సైన్స్ ఫెయిర్
- ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు
- ప్రాజెక్టులు తిలకించి అభినందించిన జేసీ ఎం జాహ్నవి, అధికారులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి



కొక్కిరాపల్లి గురుకుల విద్యార్థిని లావణ్యను అభినందిస్తున్న జేసీ జాహ్నవి

యలమంచిలి రూరల్: అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సైన్స్ ఫెయిర్‌లో బాలబాలికలు అందర్నీ ఆలోచింపజేసేలా ప్రయోగాలు చేశారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి గురుకులంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో తమ ఆలోచనలను ఆవిష్కరణలుగా మలిచి అబ్బురపరిచారు. కమ్యూనిటీ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్, పర్యావరణ అంశాలు, జాతీయ మానవ వనరులు, మానవాళి మనుగడ, ఆరోగ్యం, ప్రజల శ్రేయస్సు, స్వచ్ఛమైన నీరు, శానిటేషన్, సేంద్రియ వ్యవసాయం, రోడ్డు ప్రమాదాలు, ఫార్మా ప్రమాదాల సేఫ్టీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మొత్తం 116 ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. వారికి గైడ్ టీచర్లు కావాల్సిన సూచనలిస్తూ ప్రోత్సహించారు. ఈ సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించిన అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, గురుకులాల జిల్లా సమన్వయకర్త ఎస్ రూపవతి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి. సుజాత, జిల్లా విద్యాశాఖాధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి, యలమంచిలి ఉపవిద్యాశాఖాధికారి అప్పారావు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తిలకించారు. సైన్స్ ఫెయిర్‌లో బాలల సృజన విందును సందర్శకులు ఆస్వాదించారు. కొక్కిరాపల్లి, మేఘాద్రిగెడ్డ, సబ్బవరం గురుకులాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, అవి సమాజ శ్రేయస్సుకు ఎలా ఉపయోగపడతాయో వారు వివరించే తీరును జేసీ, మున్సిపల్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే ప్రశంసించారు. విద్యార్థులకు సైన్సు పట్ల ఆసక్తి పెంచి, వారి ఆలోచనలకు పదును పెట్టేలా చేస్తే గొప్పగొప్ప ఆవిష్కరణలు చేయగలరు. వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తే సమాజానికి ఉపయోగపడే పరికరాలను తయారు చేసి ఆశ్చర్యపరచగలరని వారు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన నమూనాలకు సంబంధించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు త్వరలో జోనల్ స్థాయి పోటీల్లో తమ నమూనాలను ప్రదర్శించనున్నట్టు కొక్కిరాపల్లి గురుకులం ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం తెలిపారు.

ఆలోచింపజేసిన ప్రాజెక్టులు

'విద్యుత్‌ను ఆదా చేయడానికి ఇళ్లలో ఆటోమేటిక్ రిమోట్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా ఇళ్లలో లైట్లు, ఫ్యాన్లు, విద్యుత్‌తో పనిచేసే ఇతర ఉపకరణాలు వాటంతటవే ఆగిపోయేలా స్మార్ట్ హోం ప్రాజెక్టును తయారు చేసింది కోనాం గురుకులం విద్యార్థిని రోజా.

'వరదలు సంభవించేటప్పుడు ముందుగానే ప్రజలను అప్రమత్తం చేయడానికి వీలుగా నక్కపల్లి గురుకులం విద్యార్థినులు కె. అస్మితశ్రీ, బి. అమృతశ్రీ ప్రత్యేకంగా రూపొందించిన ఫ్లడ్ డిటెక్టింగ్ అలారమ్ సిస్టమ్ అబ్బురపరిచింది.

'ప్రాణాంతక డెంగ్యూ, మలేరియా, అతిసారం, టైఫాయిడ్ వంటి వ్యాధులను కలగజేసే దోమల వ్యాప్తికి డ్రైనేజీల్లో మురుగునీరే ప్రధాన కారణం. చాలా చోట్ల డ్రైనేజీల్లో మురుగు రహదారులపై పారుతూ పారిశుధ్య లోపానికి దారి తీస్తోంది. దీనిని పరిష్కరించేందుకు సఫాయి మిత్ర పేరుతో డ్రైనేజీల్లో మురుగు పరిమితికి మించి పారినప్పుడు ఒక సెన్సార్‌తో కూడిన ప్రత్యేక వ్యవస్థ ద్వారా మున్సిపల్ అధికారులను అలర్ట్ చేసేలా ప్రాజెక్టు రూపొందించారు సబ్బవరం గురుకులం 9వ తరగతి విద్యార్థులు జె. సందీప్, వి. విజయ్‌కుమార్. అదే గురుకులానికి చెందిన విద్యార్థులు ఆర్. లక్ష్మీనరసింహ, టి. రాంబాబు స్వచ్ఛ జీవన్ పేరుతో తడి, పొడి, ప్లాస్టిక్ చెత్తను వేర్వేరుగా చెత్త డబ్బాల్లో వేసిన వారికి రివార్డు పాయింట్లు ఇవ్వడం ద్వారా వారికి మున్సిపల్ ట్యాక్సుల్లో రివార్డు పాయింట్లతో రాయితీ కల్పించడం అనే కొత్త కాన్సెప్టును రూపొందించారు.



కొక్కిరాపల్లి గురుకులం విద్యార్థినులు రూపొందించిన నమూనా

కొక్కిరాపల్లి గురుకులం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్. లావణ్య పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్య కారకాలతో మలినమైన గాలిని ప్యూరిఫై చేయడానికి రూపొందించిన బ్రీత్ సేఫ్ ఇండస్ట్రీస్ ప్రాజెక్టు, 8వ తరగతి ఏ సెక్షన్ విద్యార్థినులు పి. లిఖిత, ఎ. కుమారి సోలార్ లైట్, వ్యవసాయానికి వర్షపు నీటినిల్వ చేయడానికి సులభమైన పద్ధతిని తెలియజేసే ప్రాజెక్టు తయారు చేశారు.



ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు మేఘాద్రిగెడ్డ గురుకుల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు

ఇటీవల దేశంలో, రాష్ట్రంలో పలుచోట్ల ఫార్మా కంపెనీల్లో తరచుగా జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఆటోమేటెడ్ సేఫ్టీ మానిటరింగ్ అండ్ యాక్సిడెంట్ అలర్ట్ సిస్టమ్ రూపొందించారు. ఫార్మా కర్మాగారాల్లో ప్రమాదాలు జరిగేటపుడు ఈ వ్యవస్థ అందర్నీ అప్రమత్తం చేస్తుందని ప్రాజెక్టు తయారు చేసిన మేఘాద్రిగెడ్డ గురుకులం విద్యార్థినులు కె. లోహిత, వై హిమబిందు తెలిపారు.



తాళ్లపాలెం గురుకుల విద్యార్థినులు రూపొందించిన నమూనా ప్రదర్శన

రైల్వే స్టేషన్లలో విద్యుత్‌ను ఆదా చేయడానికి, వాడకాన్ని తగ్గించడానికి ఐఆర్ సెన్సర్‌తో పనిచేసే ప్రత్యేకమైన వ్యవస్థను తాళ్లపాలెం గురుకులం విద్యార్థినులు ఎం. దేదీప్య, టి. అక్షయ తయారు చేశారు. ఇదే గురుకులం విద్యార్థినులు టి. మాధురి, టి. నవ్యశ్రీలు భారీ వర్షాలు, వరదలు సంభవించినపుడు పంటలు నష్టపోకుండా ఫ్లోటింగ్ మల్టీకల్చర్ పేరుతో తయారు చేసిన ప్రాజెక్టు ఆకట్టుకుంది.



స్మార్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు

భూమిలో తేమ శాతాన్ని బట్టి వ్యవసాయానికి అవసరమైన నీరు విడుదలయ్యేలా స్మార్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తాళ్లపాలెం గురుకులం విద్యార్థినులు తయారు చేశారు.



శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన ఫ్లోటెడ్ హోం ప్రాజెక్టు

పట్టణాలు, నగరాల్లో భారీగా వరదలు వచ్చినప్పుడు ఆటోమేటిక్ హైడ్రాలిక్ వ్యవస్థతో భవనాలు ఎత్తు పెరిగి ధన, ప్రాణ నష్టం తగ్గేలా వినూత్నమైన ప్రాజెక్టు రూపొందించారు శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు పి. శివకృష్ణ, కె. లోకేష్.



మేఘాద్రిగెడ్డ విద్యార్థినులు రూపొందించిన నమూనా

'హైడ్రాలిక్ మిస్సైల్ లాంచింగ్ ప్రాజెక్టును మేఘాద్రిగెడ్డ గురుకులం 10వ తరగతి విద్యార్థినులు పి. లావణ్య, టి. నీరజ తయారు చేశారు.

తారస్థాయికి 'తమ్ముళ్ల' వర్గ విభేదాలు

- దేవరాపల్లి టీడీపీలో రగులుతున్న 'ఆధిపత్య'పోరు
- రైవాడ అతిథి గృహంలో కొట్లాటకు దిగిన పచ్చ నేతలు
- వలస నేతలపై బహిరంగ విమర్శలతో రేగిన వివాదం



దేవరాపల్లిలో పరస్పర దూషణలు, తోపులాటకు దిగిన టీడీపీ శ్రేణులు

దేవరాపల్లి: దేవరాపల్లిలో తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. పాత, వలస నాయకులు, కార్యకర్తలు బాహాటంగా కుమ్ములాటకు దిగారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వలస టీడీపీ నేతలు, పాత నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పర విమర్శలతో బాహాబాహీకి దిగారు. దీంతో దేవరాపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 20, 22 తేదీలలో మండలంలో జరిగే పల్లె పండుగ కార్యక్రమం ఏర్పాట్లపై చర్చించేందుకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ శుక్రవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కోసం గ్రామాల్లో పనిచేసిన వారిని విస్మరించి, ఎన్నికలకు వారం రోజుల ముందు పార్టీలో చేరిన వారికి పెద్దపీట వేయడంపై ఇటీవల పాత నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ బహిరంగ విమర్శలు చేసిన సంగతి విదితమే. ఈ విషయమై కొందరు వలస టీడీపీ నేతలు ప్రశ్నించడమే వివాదానికి కారణంగా తెలిసింది. దీంతో ఇరువర్గాలకు చెందిన వారు పరస్పర దూషణలతో ఒకరిపై మరొకరు నెట్టుకుంటూ దూసుకెళ్లడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అక్కడే ఉన్న కొందరు సీనియర్ నాయకులు సముదాయించే ప్రయత్నం చేసినా పరిస్థితి అదుపులోకి రాలేదు. అరుపులు, కేకలతో ఇరు వర్గీయులు రెచ్చిపోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలు రాజకీయ ఆధిపత్యం కోసం నువ్వా.. నేనా అన్నమాదిరిగా వ్యవహరిస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ విస్మయం వ్యక్తం చేస్తోంది. ఇదిలా ఉండగా ఎం.అలమండ, గరిశింగి గ్రామాల టీడీపీ నేతలు సైతం వర్గాలుగా విడిపోయి గొడవలకు దిగడంతో స్థానికులు అడ్డుకున్నారు.

పాత్రికేయులకు బెదింపులు

టీడీపీ నేతల బాహాబాహీకి దిగిన వైనాన్ని పాత్రికేయులు ఫొటోలు, వీడియోలు తీస్తుండగా ఆ పార్టీ నాయకులు బెదిరింపులకు దిగారు. వర్గ విభేదాలపై ఇష్టానుసారం వార్తలు రాస్తే రానున్న రోజులు ఇబ్బందులు పడతారని హెచ్చరిస్తూ మండల ప్రధాన కార్యదర్శి సెరకాన సూర్యనారాయణ బెదిరించడంపై అక్కడే ఉన్న పలువురు పాత్రికేయులు తిరుగుబాటు చేశారు. దీంతో పక్కనే పార్టీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ జోక్యం చేసుకుని పాత్రికేయులకు క్షమాపణ చెప్పడంతో శాంతించారు.

మెకానిక్ షెడ్డులో అగ్ని ప్రమాదం

- మూడు బైక్‌లు దగ్ధం



కాలిపోయిన బైక్‌లు

బుచ్చెయ్యపేట: మండలంలోని విజయరామరాజుపేటలో గురువారం అర్ధరాత్రి బైక్ మెకానిక్ షెడ్డు ముందు జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు బైక్‌లు దగ్ధమయ్యాయి. చీడికాడ మండలం ఖండివరానికి చెందిన వ్యక్తి విజయరామరాజుపేటలో బైక్ మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికెళ్లిన తర్వాత అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. రోడ్డున పోయే కొంతమంది యువకులు బైక్‌లు తగలబడటాన్ని చూసి మంటలార్పడానికి ప్రయత్నించగా, అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో మూడు బైక్‌లు దగ్ధంకాగా, ఒక స్కూటీ పాక్షికంగా కాలిపోయింది. షెడ్డు నిర్వాహకుడికి తీవ్రంగా నష్టం కలిగింది. అతడు బుచ్చెయ్యపేట పోలీసులను ఆశ్రయించాడు.

ప్రైవేటు బస్సు ఢీకొని సెజ్ ఉద్యోగి మృతి

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్ఈజెడ్ ఉద్యోగి మృతి చెందాడు. అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజుపేటకు చెందిన ఆళ్ల రవికుమార్ (35) ఎస్ఈజెడ్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని అచ్యుతాపురం జంక్షన్‌కు నడుచుకొని వస్తుండగా, వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు మృతి చెందాడు. అచ్యుతాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి ఎడిటర్‌పై కేసు నమోదు పిరికిపంద చర్య


- కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ



నక్కపల్లి: ఇటీవల విజయవాడ వరదల సమయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, నిర్వాసితులకు ఆర్థిక సాయం పంపిణీలో జరిగిన అవకతవకలను ప్రచురించిన సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గు చేటని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ విమర్శించారు. భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించినప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో విఫలమైందన్నారు. ప్రభుత్వ చేతకానితనం వల్ల వేలాది కుటుంబాలు వరదల్లో చిక్కుకుని దాదాపు పది రోజుల పాటు నరకం అనుభవించాయన్నారు. అన్నపానీయాలు లేకుండా నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చిందన్నారు. రూ. వందల కోట్లు పులిహోరకు అగ్గిపెట్టెల కోసం ఖర్చు చేయడం సిగ్గుచేటన్నారు. అయినప్పటికీ బాధితులకు సాయం అందలేదన్నారు. వరద సహాయక చర్యల్లో జరిగిన నిర్లక్ష్యాన్ని అవినీతిని సాక్షి పత్రిక సాక్ష్యాధారాలతో ప్రజలకు తెలియజేసిందన్నారు. విజయవాడ వరద సహాయక చర్యల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విషయాన్ని అన్ని సామాజిక మాధ్యమాలు దుమ్మెత్తిపోశాయన్నారు. వాస్తవాలను ప్రచురించిన సాక్షి పత్రిక ఎడిటర్‌పై కేసు నమోదు చేయడం పిరికి పంద చర్య అన్నారు. అక్రమాలు, అవినీతి జరగకపోతే పత్రికల్లో ప్రచురితమైన కథనాలపై ఖండన ఇవ్వాలని, అంతేతప్ప అధికార దుర్వినియోగానికి పాల్పడి కేసులు నమోదు చేయడం తగదన్నారు. ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదన్నారు. లోకేష్ రాసిన రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తే ప్రతిఘటన తప్పదన్నారు.

29 నుంచి వైద్య మిత్రలు నిరవధిక సమ్మె

- ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కనకం



మాడుగుల రూరల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పథకంలో 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి పనికి తగ్గ వేతనాలు అమలు చేయలేదని, వీరి సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఈ నెల 29 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి. కనకం హెచ్చరించారు. శుక్రవారం ఆయన కె.జె.పురంలో మాట్లాడుతూ ఈ నెల 14న గుంటూరులో ఎన్టీఆర్ వైద్య సేవ హెల్త్ కేర్ ట్రస్టు సీఈవో లక్ష్మీశాకు రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ గోవింద ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో వైద్య మిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానిటరింగ్ క్యాడర్‌కు కనీస వేతనాలు అమలు చేయకపోవడంపై ట్రస్టు అధికారులు, రాష్ట్ర వైద్య శాఖ అధికారుల వద్ద ప్రస్తావించినా స్పందించలేదని వాపోయారు. ముఖ్యంగా ఫీల్డ్ సిబ్బంది సర్వీసు పరిగణనలోకి తీసుకొని సమాన పనికి సమాన వేతనం అమలు చెయ్యడంతో పాటు ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని, వన్‌టైం ఎగ్జామ్‌ను ఉపసంహరించుకోవాలని, సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించాలా చర్యలు తీసుకోవాలని, చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు రూ.10 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటిని పరిష్కరించకపోతే ఈ నెల 29వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటామన్నారు.

మోకాళ్లపై అభిజిత్ కంపెనీ కార్మికుల నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం ఎస్ఈజెడ్ పరిధిలో అభిజిత్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కంపెనీ ఎదుట ఉద్యోగులు, కార్మికులు మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. రాము, మండల కన్వీనర్ సోమునాయుడు మాట్లాడుతూ అభిజిత్ కంపెనీ కార్మికులతో సంప్రదించకుండా లే-ఆఫ్ ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. అయిదు రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ రేపు

అనకాపల్లి: విశ్రాంత ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాల్గో రాష్ట్ర మహాసభ ఈ నెల 20న విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విత్తనాల పోతురాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.వి.కె.రాయ్, కె.ఆర్. ఆంజనేయులు హాజరవుతారన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కారం, మారుతున్న కాలానికి అనుగుణంగా పెన్షన్ పెంచాలని తదితర డిమాండ్ల సాధనకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఆర్టీసీ పింఛనుదారులంతా హాజరు కావాలని కోరారు.

వచ్చే నెల 21న పడమటమ్మ పుట్టుక మహోత్సవం

కశింకోట: స్థానిక పడమటమ్మ తల్లి పుట్టుక మహోత్సవాన్ని వచ్చే నెల 21న భారీ స్థాయిలో నిర్వహించడానికి ఉత్సవ కమిటీ నిర్ణయించింది. జిల్లాలో పేరొందిన ఈ ఉత్సవం రెండేళ్లకొకమారు ఇక్కడ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా విసన్నపేటలో కొలువైన పడమటమ్మను నియమ నిష్టలతో పూజించి మిడుత, పురుగు తదితర రూపాల్లో వచ్చే అమ్మవారిని పల్లకిలో తీసుకొచ్చి గ్రామంలో ఊరేగిస్తారు. ప్రత్యక్ష దైవంగా ప్రజలకు దర్శనం కల్పించి ఇక్కడి ఆలయంలో నిలిపి నెల రోజుల తర్వాత పండగ నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. ఉత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.

గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊయలలో గౌరీపరమేశ్వరులను ఊగిస్తున్న అర్చకులు, భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల 197వ ఊంజల్ సేవ జరిగింది. అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, కృష్ణశర్మ, పాండూరు సూర్యనారాయణశాస్త్రి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ, ఎం.వి.లోవరాజు, గంగరాజు దంపతులు, ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 148 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,200	5,200
మొదటి రకం	4,310	5,400
రెండో రకం	3,590	4,400
మూడోరకం	3,400	3,400

అనకాపల్లి సినిమాలు

దేవర	:రాజా
విశ్వం	: సత్యనారాయణ స్క్రీన్-1
లవ్‌రెడ్డి	:సత్యనారాయణ స్క్రీన్-2
జనక అయితే గనక	: పర్తిసాయి
వేట్టయాన్	: షిర్డీసాయి
వీక్షణం	: వెంకటేశ్వర
మా నాన్న సూపర్ హీరో	: శ్రీసత్య
రివైండ్ (మాట్నీ, సెకండ్ షో)	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్- 5 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-11 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ 9703619706ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595ను సంప్రదించవచ్చును.

నట్టల బెడదకు చెక్

జీవాల్లో నట్టల బెడద సర్వసాధారణం.. నేలపై మేత మేయడం వల్ల ఆ సమస్య ఉత్పన్నమవుతోంది. నట్టల్లో ప్రధానంగా ఏలిక పాములు, బద్దె పరుగులు, జలగలు ఉంటాయి. ఇవి జీవాల శరీరం, కాలేయం, ఊపిరితిత్తులు, పేగులు, జీర్ణాశయంలో స్థావరాలు ఏర్పాటు చేసుకుని హాని కలిగిస్తాయి. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ నివారణ చర్యలు చేపట్టింది. గొర్రెలకు, మేకలకు నట్టల మందులు తాపిస్తోంది.

- గొర్రెలు, మేకల ఆరోగ్యమే లక్ష్యం
- ఏడాదికి రెండు సార్లు ఉచితంగా పంపిణీ
- గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ పర్యవేక్షణలో కార్యక్రమం



పట్టణంలో పూల్‌బాగ్ రోడ్డులో గొర్రెలు, మేకలు

అనకాపల్లి: మేత లభ్యం కానప్పుడు పోషకాల లోపం ఏర్పడినప్పుడు వానకాలం, అనావృష్టి సందర్భాల్లో అంటు వ్యాధులు ప్రబలిన సమయాల్లో ఈ పరాన్న జీవుల బెడద అధికంగా ఉంటోంది. వీటి నివారణకు పశుసంవర్ధకశాఖ సిబ్బంది మందులు వేస్తున్నారు. అనకాపల్లి పట్టణ, మండలంలో 10,600, కశింకోట మండలంలో 16,030 గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటికి ఈ నెల 30వ తేదీ వరకూ నట్టల నివారణ మందులు వేసేందుకు నియోజకవర్గంలో ఆరుగురు పశువైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా సచివాలయ పరిధిలోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ల సహకారంతో గ్రామాల్లో ఉదయం 10 గంటల లోపు నట్టల మందులు పంపిణీ చేస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు నట్టల మందులు వేయడం వల్ల గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా జీవించి రైతుకు లాభం చేకూరుతుంది.

నట్టల లక్షణాలు...

పొలంలో గడ్డిని తినడం వల్ల గొర్రెలలో అంతర పరాన్నజీవులు గుడ్లు, పేడ ద్వారా నేలపై చేరి లార్వాగా వృద్ధి చెందుతాయి. అక్కడ గడ్డిని గొర్రెలు, మేకలు తిన్నప్పుడు తిరిగి శరీరంలోకి ప్రవేశిస్తాయి. పేడను ముద్దగా వేయడం, విరేచనాలు చేసినప్పుడు అందులో బద్దె పురుగులు కనిపిస్తాయి. గొర్రెలు శరీరానికి అందే పోషక పదార్థాలను నట్టలు ఉపయోగించుకోవడం వల్ల బలహీనంగా ఉంటాయి. కొన్ని రకాల అంతర పరాన్నజీవులు గొర్రెల శరీరంలో నుంచి రక్తాన్ని పీల్చుకుంటాయి. దాంతో రక్తహీనత కలిగి కళ్లు తెల్లగా పాలిపోయి ఉంటాయి. జలగలు కాలేయం(లివర్)లో ఉండటం వల్ల ఆ భాగం దెబ్బతింటుంది. దీంతో గడ్డం కింద నీరు చేరి వాపు వస్తుంది. ఈ వాపు సాయంత్రం సమయంలో మాత్రమే కనిపిస్తుంది. జీవాలు బలహీనంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో న్యుమోనియా లాంటి ఇతర వ్యాధులు బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

చికిత్సలు, నిర్ధారణ...

రైతులు గొర్రెలు, మేకలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి. పశువైద్యాధికారి ద్వారా పేడ పరీక్ష చేయించాలి. సిఫారసు చేసిన మందులు వాడాలి. చనిపోయిన జీవాలను పరీక్ష చేయించినా, ఏవైనా ఉన్నట్లయితే నిర్ధారించి మిగిలిన జీవులకు సకాలంలో మందులు వేయాలి. ఏడాదికి రెండు సార్లు నట్టల నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుంది. వైద్యుల సూచనల మేరకు ఏలికపాములు ఉన్నట్లయితే ఆల్బెండజోల్, ఫెన్‌బెండజోల్ తాగించాలి. జలగల ఉన్నట్లయితే ఆక్సిక్లోజనైడ్, రఫాక్సిపైడ్, క్లోజంటాల్ వాడాలి. బద్దె పురుగులు ఉన్నట్లయితే నిక్లోజమైడ్ మందులు తీసుకోవాలి.

నట్టల మందులు వేసిన తర్వాత...

జీవాల వయస్సు, బరువును వైద్యులు పరీక్షించిన తర్వాత మోతాదు అందజేస్తారు. తక్కువగా ఇస్తే పనిచేయదు. ఎక్కువ మోతాదు ఇచ్చినట్లయితే జీవాలకు గర్భస్రావం అయ్యే అవకాశాలు ఉన్నాయి. నట్టల మందు తాగించే ముందు రోజు తక్కువ ఆహారం ఇవ్వాలి. ఉదయం 10 గంటలలోపు జీవాలకు వేయాలి. జీవాలను మేతకు తీసుకుని వెళ్లకూడదు. కడుపులో పురుగులు మృతి చెంది పేడ ద్వారా బయటకు వస్తాయి. మందులు తాగించిన తర్వాత రైతులు ప్రత్యేక దృష్టి సారించాలి.

నియోజకవర్గంలో పశువైద్యశాఖ అధికారులు

అనకాపల్లి మండలంలో సీతానగరం, కొప్పాక, గవరపాలెం, కశింకోట మండలంలో కశింకోట, నర్సింగబిల్లి, కన్నూరుపాలెం గ్రామాల్లో పశువైద్యశాధికారులు ఉన్నారు. అనకాపల్లి మండలంలో సీతానగరం, సుందరయ్యపేట, మాకవరం, కశింకోట మండలంలో గొబ్బూరు, ఎచ్చెర్ల, తీడ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అనకాపల్లి మండలంలో గొర్రెలు 440, మేకలు 320, కశింకోట మండలంలో గొర్రెలు 750, మేకలు 400లకు నేటి వరకూ వైద్య సిబ్బంది పాల్లాలోకి వెళ్లి మందులు వేశారు. దశలు వారీగా మిగిలిన జీవాలకు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నట్టల నివారణ ద్వారా ఆరోగ్యం



గొబ్బూరులో మేకకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి

కశింకోట: నట్టల నివారణ ద్వారా గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి తెలిపారు. శుక్రవారం మండలంలోని గొబ్బూరులో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నట్టల నివారణ వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మాంసం, ఉన్ని దిగుబడి, నాణ్యత పెరుగుతుందన్నారు. వాటి పిల్లల్లో మరణాల సంఖ్య తగ్గుతుందన్నారు. పొట్టేలు సగటున రెండు కిలోల అధిక బరువు పెరిగి పది శాతం అదనపు లాభాన్ని పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. పశు సంవర్ధక శాఖ సహాయకురాలు రూపవతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు ఉచితం



గొర్రెలు, మేకలను గుర్తించి నట్టల నివారణ మందులు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఏటా జనవరి, జూన్ మాసాల్లో నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. వీటిని వేయడం వల్ల జీవాలు వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చును. ఆరోగ్యంగా జీవిస్తాయి. రైతులు జీవాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– డి.సౌజన్య, పశుసంవర్ధకశాఖ ఏడీ, అనకాపల్లి

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో గురువారం రాత్రి మరిడిమాంబ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రజలు ఎక్కువగా దర్శించారు. చీరలు, రవికెలు, అరటి గెలలు వగైరా రూపంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉత్సవం జరిగింది. కశింకోటలో నిర్వహించిన మరిడిమాంబ ఉత్సవం ఘనంగా ముగిసింది.

ప్రారంభమైన అయ్యప్ప దీక్ష పూజలు



ఘనంగా ప్రారంభమైన అయ్యప్ప దీక్షలు

తుమ్మపాల: పట్టణంలో గౌరీ రైతు సంఘ ఆశ్రమంలో శుక్రవారం నుంచి అయ్యప్ప దీక్షలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజతో ప్రారంభించి అయ్యప్ప స్వామి పీఠాన్ని ప్రధాన గురుస్వాములు మల్ల నరసింగరావు, కొణతాల పూర్ణచంద్రరావు, హరిహరనాయుడు అయ్యప్ప స్వామి శరణు గోషతో భజనలు చేశారు. గురుస్వాముల పర్యవేక్షణలో 41 రోజు దీక్షలో భాగంగా మొదటిరోజు కొంతమంది కన్య స్వాములకు గురుస్వాములు సూచనలను అందజేశారు.

- అయ్యప్పల ఆశ్రమం గౌరీ సేవా సంఘం కృష్ణ మందిరం వద్ద గురుస్వామి నరసింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీఠంలో 80 మంది భక్తులు పాల్గొన్నారు. నిత్యం విశేష పూజల కార్యక్రమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కొణతాల అప్పలనాయుడు, బుద్ధ శ్రీనివాసరావు, గురుస్వాములు పాల్గొన్నారు.

65 మంది పోలీసుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలీస్ అధికారులు

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని అనకాపల్లి ఎస్పీ ఎం.దీపిక ప్రారంభించారు. ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులు, హోంగార్డులు, కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు 65 మంది రక్తదానం చేశారు. సేకరించిన 65 యూనిట్ల రక్తాన్ని ఎన్టీఆర్ మెమోరియల్ బ్లడ్ బ్యాంక్‌కు అందించారు. రక్తదానం చేసిన పోలీసులకు ఎస్పీ దీపిక ప్రశంసా పత్రాలు అందించారు. ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయాలని సూచించారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల మందు



సుందర్యపేటలో గొర్రెలకు నట్టల మందు వేస్తున్న రామ్మోహన్‌రావు

అనకాపల్లి: జిల్లాలో గొర్రెలు, మేకలకు నట్టల మందు వేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి.రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలో సుందర్యపేటలో శుక్రవారం ఆయన గొర్రెలకు నట్టల మందులు వేశారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఈ నెల 30వ తేదీ వరకూ నట్టల మందులు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డి.సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన వెంకటేశ్వరరావు

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే వారి కుటుంబం ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక న్యూకాలనీ పాలూరి చితంబరం రోటరీ హాల్లో రోటరీ క్లబ్(3020) ఆధ్వర్యంలో (కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో) మహిళలకు ఉచితంగా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన 15 కుట్టు మిషన్లు, రోటరీ క్లబ్ ఆర్థిక సాయంతో మరో మూడు గురువారం రాత్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత నెల 27 నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ 18 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామన్నారు. వీరికి రూ.25 వేలు విలువ చేసే ఒక్కొక్క మిషన్ అందజేశామన్నారు. మహిళలు ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ.12 నుంచి రూ.15 వేలు సంపాదించవచ్చన్నారు. శిక్షణ పొందిన మహిళలంతా గ్రూపుగా ఏర్పడి విద్యార్థుల యూనిఫాం, బ్యాగ్‌లు, మహిళలకు వస్త్రాలను కుట్టడం ద్వారా ఎంతో ఉపాధి పొందవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ముద్రా లోన్‌లు ఇప్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. క్లబ్ ఏర్పాటు చేసి 71 సంవత్సరాలు అవుతుందని, ఏటా నిరుపేదలకు ఉచితంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ ఏడాది కుట్టుమిషన్లు పంపిణీ చేశామని, త్వరలో మరో రెండు కార్యక్రమాలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు రోటరీ జిల్లా మాజీ గవర్నర్ దత్త సుబ్బారావు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రోటరీ పట్టణ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్, కుట్టుమిషన్ ప్రాజెక్టు చైర్మన్ కడిమిశెట్టి సతీష్, కో చైర్మన్ బుద్ధ రమణాజీ, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య ఎన్నికలు వాయిదా



మాట్లాడుతున్న సాయిప్రశాంతి



ఎన్నికల పర్యవేక్షకురాలు వెలుగు ఏపీడీ డైజీ

- రసాభాసగా మారడంతో నిలిపివేత

సబ్బవరం: మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య ఎన్నికలు రసాభాసగా మారడంతో వాయిదా పడ్డాయి. వెలుగు ఏపీడీ జి.డైజీ ఎన్నికల నిర్వహణ పర్యవేక్షకురాలిగా వ్యవహరించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జిల్లా సమాఖ్య ఎన్నికలు జరుగుతాయి. జిల్లాలోని అన్ని మండలాల సమాఖ్య సభ్యులు పాల్గొని వెలుగు జిల్లా సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ మేరకు జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని 24 మండలాల నుంచి హాజరైన మండల సమాఖ్య సభ్యులు జిల్లా సమాఖ్య, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నర్సీపట్నానికి చెందిన సాయిప్రశాంతిని కార్యదర్శిగా పోటీ చేశారు. కొంత మంది సభ్యులు ఆమె కార్యదర్శిగా పోటీ చేసేందుకు అనర్హురాలంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎన్నికలు రసాభాసగా మారి ఈ నెల చివరి నాటికి వాయిదా వేశారు.

కార్యదర్శి ఎన్నికపై అభ్యంతరం..

ఈ విషయంపై ఎన్నికల పరిశీలకురాలు జి.డైజీ మాట్లాడుతూ కార్యదర్శిగా పోటీ చేసిన సాయిప్రశాంతిని మరో ఎన్‌జీవోలో పనిచేస్తుండటంతో సభ్యులు ఆమె ఎన్నికపై అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. దీంతో ఆమె పోటీ చేసేందుకు అనర్హురాలని తెలియజేశారు. సాయిప్రశాంతిని మాట్లాడుతూ సోషల్ సర్వీస్ చేస్తున్న తనను పోటీ చేయకుండా అడ్డుకోవడం తీవ్ర అన్యాయమన్నారు. తనను అడ్డుకునేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేసి ఎన్నికల్లో పోటీ చేస్తానని, ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు.

నేడు 3 గ్రామాల్లో పల్లె పండగ

కశింకోట: మండలంలో వర్షాల వల్ల వాయిదా వేసిన పల్లె పండగ – పంచాయతీ వారోత్సవాలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. జి.భీమవరం శివారు సింగవరంలో ఉదయం 9 గంటలకు, మోసయ్యపేటలో ఉదయం 10 గంటలకు, అచ్చెర్లలో 11 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధి నిధులతో సిమెంట్, తారు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలపై జాప్యం తగదు



నిరసన చేస్తున్న ఉపాధ్యాయులు

- యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్

తుమ్మపాల: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరని, ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదని వాపోయారు. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలని, మున్సిపల్ టీచర్ల పీఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. జీతాల నుంచి మినహాయించి సొమ్ము వారి ఖాతాలకు జమ చేసేందుకు గాని, ఖాతాలలో సొమ్ము అవసరాలకు వినియోగించుకునేందుకు గాని అవకాశం లేకుండా పోయిందన్నారు. సమస్యలపై ఎన్నిమార్లు ప్రాతినిధ్యం చేసినా పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. మున్సిపల్ టీచర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు వి. శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శులు ఎ.ప్రకాష్, శేషకుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్యబాబు, అప్పారావు, మున్సిపల్ నాయకులు అక్కునాయుడు, సతీష్, రాజునాయుడు, నరసింహమూర్తి, జగన్, వేణు గోపాల్, సీనియర్ నాయకులు బాబూరావు, రవి, సత్యవేణు, ఆశ, శంకర్, అజయ్, తేజ్ పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



చెరువును తలపిస్తున్న తుమ్మపాల - అనకాపల్లి రోడ్డు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధ్వంసమై గోతులు ఏర్పడ్డాయి. మండలంలో తుమ్మపాల – అనకాపల్లి రోడ్డు మరింత దారుణంగా ఉంది. చినబాబు కాలనీ వద్ద డబుల్ లైన్ రోడ్డు సింగల్ లైన్‌కే పరిమితం అయ్యింది. తుమ్మపాల నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఎడమ వైపు రోడ్డు పూర్తిగా వర్షపునీటితో నిండిపోయింది. సుమారు 300 మీటర్ల పొడవున రోడ్డంతా నీరు చేరి నిండిపోవడంతో ద్విచక్ర వాహన దారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానికులు ఒక వైపు రోడ్డును పూర్తిగా మూసివేయడంతో ప్రయాణికులు కుడి వైపు రోడ్డు మీదుగా రాకపోకలు చేస్తున్నారు. అత్యంత దారుణంగా తయారైన గుంతల రోడ్డుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్డు గోతుల్లో క్రషర్ బొగ్గు పోసి చేతులు దులుపుకుంది. ఇప్పుడు వర్షానికి బూడిద పోయి గోతులు మిగిలాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు

సబ్బవరం: ప్రభుత్వ భూమి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 277/1ఏలో 9.32 ఎకరాల గెడ్డవాగులో ఆక్రమణలకు పాల్పడుతూ సాగు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. సర్వే నంబర్ 449/9లో 6.07 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పాల్పడినట్లు గుర్తించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తోపాటు సబ్బవరం మండల తహసీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆర్ఐ వీరయ్య, సచివాలయ సర్వేయర్ లోకేష్, ఇతర సిబ్బంది చర్యలు చేపట్టారు.


ఎన్టీఆర్ వైద్యాలయంలో సిటీ స్కానింగ్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో సిటీ స్కానింగ్ మిషన్‌ను శనివారం నుంచి రోగులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఆస్పత్రిలో వివిధ విభాగాలను ఆయన పరిశీలించారు. రోగులకు మేరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా ఆస్పత్రికి కావలసిన వైద్య సిబ్బందిని పెంచేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలుపుదల చేయాలి

నర్సీపట్నం: విద్యుత్ భారాలను తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల అమర్చడం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలుపుదల చేయాలని కోరుతూ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. రాజు మాట్లాడుతూ ప్రభుత్వం రూ.20 వేల కోట్ల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యుత్ చట్టంలో భాగంగా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని చెప్పారు. ముందుగా వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు అమర్చిన తరువాత ఇళ్లకు అమర్చాలన్నది ప్రభుత్వ ఆలోచనని తెలిపారు. ఈ విధానాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

తుమ్మపాల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం కూండ్రం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం జరిగాయి. అండర్ – 17 విభాగంలో బాల బాలికలకు పోటీలు నిర్వహించారు. సాయంత్రం వరకూ హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఒక్కో విభాగంలో 12 మంది ప్రధాన క్రీడాకారులతో పాటు ఇద్దరు అదనపు క్రీడాకారులను ఎంపిక చేశారు. 14 మంది చొప్పున ఎంపిక చేసిన క్రీడాకారులు త్వరలో జరగనున్న ఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.కె. భాస్కరం, వ్యాయామ ఉపాధ్యాయులు కె.ఎం. నాయుడు, కె. ధనంజయరావు, నిరుజోగి వెంకటరావు, సన్యాసినాయుడు, ముత్యం శ్రీను, ఎస్ఎస్ రాజా తదితరులు పాల్గొన్నారు.